క్లుప్తంగా

నేడు రైల్వేగేటు మూసివేత

కాశీబుగ్గ: పలాస మండలం నీలావతి వద్ద ఉన్న రైల్వే గేటుకు గురువారం మరమ్మతులు చేపడుతున్నారు. దీంతో ఉదయం ఆరున్నర నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గేటును మూసివేస్తున్నట్టు గేట్‌మన్ వంకల కృష్ణారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ సమయంలో ఎటువంటి వాహనాల రాకపోకలకు అవకాశం లేదని.. ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

వరద బాధితులను ఆదుకోవాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు

ఇచ్ఛాపురం రూరల్: విజయవాడ వరద బాధితుల ను ప్రభుత్వమే పూర్తి స్థాయిలో ఆదుకోవాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. బుధవారం ఇచ్ఛాపురం మండలానికి వచ్చిన ఆయన మాట్లాడు తూ గత ప్రభుత్వ హయాంలో వలంటీర్లు ఉండటంతో కరోనా, వరదలు వంటి విపత్తు సమ యంలో ఆపద్బాంధవుల్లా ప్రాణాలకు తెగించి సేవా కార్యక్రమాలు చేశారని గుర్తు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో వలంటీర్లు ఉండుంటే అధికారులకు చేదోడు వాదోడుగా ఉండేవారన్నా రు. అందరికీ ఆహారం అందించలేక పోయామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడం సబబు కాదన్నారు. తక్షణమే పునరావాస కేంద్రాల ద్వారా బాధితులకు రక్షణ కల్పించాలని, ఇళ్లు కోల్పోయి నిరాశ్రయులుగా ఉన్నవారికి ప్రభుత్వమే ఉచితంగా ఇళ్లు కట్టి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

చవితి ఉత్సవాలకు జెడ్పీ చైర్‌పర్సన్‌కు ఆహ్వానం


విజయకు ఆహ్వానాన్ని అందిస్తున్న కమిటీ సభ్యులు

కవిటి: మండలంలోని జగతిలో శనివారం నుంచి వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవంలో పాల్గొనాలని కోరుతూ శ్రీకాకుళం జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయను బల్లిపుట్టుగలోని ఆమె నివాసంలో కలిసి జగతి పార్క్‌స్ట్రీట్ పూజా కమిటీ సభ్యులు బుధవారం ఆహ్వాన పత్రాన్ని అందజేశారు.

సర్కార్ బడికి జై..


నేడు టీచర్స్ డే

వారికి తమ పిల్లలను ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో చదివించే స్థోమత ఉంది. అయినా ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించి చదివించి ఆదర్శంగా నిలుస్తున్నారు పలువురు ఉపాధ్యాయులు. సర్కార్ బడులకు జై కొడుతున్నారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యా సంస్కరణలు సత్ఫలితాలు ఇచ్చాయి. మనబడి నాడు-నేడు' పేరుతో కార్పొరేట్ పాఠశాలలకు తలదన్నే విధంగా సౌకర్యాలు, ఇంగ్లిష్ మీడియంలో బోధన, సీబీఎస్ సిలబస్, యూనిఫాం, జగనన్న విద్యా కానుకలు, పుస్తకాలు, నోట్ పుస్తకాలు, జగనన్న గోరు ముద్దతో రుచికరమైన పౌష్టికాహారం, అమ్మ ఒడి వంటి పథకాలతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాశాఖలో తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పులతో ప్రైవేటు నుంచి ప్రభుత్వ బడికి వెళ్లేలా చేస్తున్నాయి. గురువారం టీచర్స్‌డే సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చదివిస్తున్న ఆదర్శ ఉపాధ్యాయుల గురించి తెలుసుకుందాం.

- టెక్కలి, ఇచ్ఛాపురం రూరల్, కవిటి

• ఇద్దరు కుమార్తెలు సర్కార్ బడిలోనే..


ఇద్దరు కుమార్తెలు ఉమశ్రీ, సాహితిలతో సూర్యప్రకాశ్

టెక్కలి: ఉపాధ్యాయుడు సమాజానికి మార్గదర్శకుడు అనే దానికి టెక్కలికి చెందిన ఉపాధ్యాయుడు ఆదర్శంగా నిలుస్తున్నారు. తన ఇద్దరు పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తూ గౌరవాన్ని పొందుతున్నారు. టెక్కలి శ్రీనివాసనగర్‌కు చెందిన వూన సూర్యప్రకాశ్ టెక్కలి మండలం లింగాలవలస జెడ్పీ ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్రం ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. సూర్యప్రకాశ్, కవిత దంపతులకు ఉమశ్రీ, సాహితి అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇద్దరు పిల్లల్ని కార్పొరేట్ పాఠశాలల్లో చదివించే స్థోమత ఉన్నప్పటికీ ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న విద్యా, మౌలిక వసతులపై అవగాహన ఉండడంతో ఇద్దర్నీ టెక్కలి బాలికల ఉన్నత పాఠశాలలో చదివిస్తున్నారు. పెద్ద కుమార్తె ఉమశ్రీ 9వ తరగతి, చిన్న కుమార్తె సాహితి 8వ తరగతి చదువుతున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు సూర్యప్రకాశ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చక్కని విద్య, మౌలిక వసతులు ఉండడమే కాకుండా ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తే మరి కొంత మంది వారి పిల్లల్ని చేర్పిస్తారనే నమ్మకంతో తన పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తున్నానని ఆయన తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

• తల్లిదండ్రుల్లో నమ్మకం కల్పించేలా


కుమార్తె భవిష్యతో ఉపాధ్యాయురాలు కాంచన

ఇచ్ఛాపురం మండలంలోని బిర్లంగి ప్రాథమిక పాఠశాలలో ఎం.కాంచన ఎస్జీటీగా పనిచేస్తుండగా, ఆమె భర్త ఎం.మల్లేశ్వరరావు అదే మండలం బి.తోటూరు ప్రాథమికోన్నత పాఠశాలలో తెలుగు భాషోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. తమ ఒక్కగానొక్క కుమార్తె భవిష్యను కార్పొరేట్ పాఠశాలల్లో చదివించే స్థోమత ఉన్నప్పటికీ తాము చదువు చెప్పే సర్కారు బడిలోనే చేర్పించాలనుకున్నారు. బిర్లంగి ప్రాథమిక పాఠశాలలో భవిష్యను చేర్పించారు. తమ పాపను సర్కారు బడిలో చదివించడంలో నామోషీలేదని, తాము చదువు చెప్పే బడిలోనే మా పిల్లల్ని చేర్పిస్తే గ్రామంలోని తల్లిదండ్రుల్లో నమ్మకం పెరుగుతుందని అంటున్నారు ఈ ఉపాధ్యాయ దంపతులు.

• అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాం


కుమార్తె, కుమారుడుతో ఉపాధ్యాయ దంపతులు రాజేశ్వరి, ప్రకాశ్‌రెడ్డి

తాము సర్కారు బడిలోనే చదువుకుంటూ ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడ్డామని, అందుకే తమ ఇద్దరి పిల్లల్ని సైతం ప్రభుత్వ బడుల్లో చదివిస్తున్నామని చెబుతున్నారు ఈ ఉపాధ్యాయ దంపతులు. ఇచ్ఛాపురం మండలం ఈదుపురం(ఆర్) ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా బి.రాజేశ్వరి పనిచేస్తుండగా, భర్త బి.ప్రకాశ్‌రెడ్డి పురుషోత్తపురం మున్సిపాలిటీ పాఠశాలలో పనిచేస్తున్నారు. కార్పొరేట్ స్థాయిలో బడు లు, ముచ్చట గొలిపే యూనిఫాంలో విద్యార్థులు, ఇంగ్లిష్‌లో చదువులు, కష్టబడి చదువులు చెప్పే ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉండటంతో తాము చదువులు చెప్పే బడిలో కాకుండా తమ కుమార్తె మోక్షశ్రీని కొఠారీ ప్రాథమిక పాఠశాలలో చేర్పించా రు. అలాగే కుమారుడు నాగేంద్రరెడ్డిని తాను పనిచేసే ఈదుపురం ప్రభుత్వ బడిలో నే చేర్పించినట్లు ఉపాధ్యాయురాలు రాజేశ్వరి తెలిపారు.

• తండ్రీ కూతుళ్లు సర్కారు బడికే


కుమార్తె పర్ణశ్రీని స్కూటీపై బడికి తీసుకువెళ్తున్న సోమేశ్వరరావు

ఇచ్ఛాపురం మండలం ధర్మపురం ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా కీలు సోమేశ్వరరావు పనిచేస్తుండగా, ఆయన భార్య ప్రమోదిని బలియాగడ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తోంది. మూడేళ్లలో పూర్తిగా మారిపోయిన సర్కారు బడులు, ఇంగ్లిష్ మీడియం చదువులు, పూర్తి స్థాయిలో ఉపాధ్యాయ సిబ్బంది, బడిలో మౌలిక సదుపాయాలు ఈ ఉపాధ్యాయ దంపతులను ఆకర్షించాయి. దీంతో తమ కుమార్తె పర్ణశ్రీని తాను చదువు చెప్పే ధర్మపురం ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతిలో చేర్పించడం జరిగిందని, అప్పటి నుంచి ఇప్పటి వరకు తన కుమార్తెను సర్కారు బడిలోనే చదివిస్తున్నట్లు ఉపాధ్యాయుడు కీలు సోమేశ్వరరావు తెలిపారు.

• కార్పొరేట్ బడులకు దీటుగా


పాఠశాలలో కుమార్తె నదీషతో ఉపాధ్యాయురాలు ఎం.శ్రావణి

తాము చదువుకునే రోజుల్లో అస్తవ్యస్తంగా ఉండే ప్రభుత్వ బడుల నుంచి కార్పొరేట్‌కు దీటుగా ఉండే సర్కారు బడుల్లో చదువులు చెబుతామని తామెప్పుడూ అనుకోలేదని చెబుతున్నారు ఉపాధ్యాయ దంపతులు. జలుమూరు మండలానికి చెందిన ముద్దాడ రమణ ఇచ్ఛాపురం మండలం చిన్నలక్ష్మీపురం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తుండగా, మడపాం గ్రామానికి చెందిన ఎం.శ్రావణి కొఠారీ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తోంది. సర్కార్ బడుల్లో పూర్తిస్థాయిలో సిబ్బంది, మౌలిక సదుపాయాలు ఉండడంతో మా పాప నదీషను సర్కార్ పాఠశాలలోనే చదివిస్తున్నారు. ఉన్నత విద్య వరకు పాపను ప్రభుత్వ బడిలోనే చదివిస్తామని చెబుతున్నారు.

• ప్రభుత్వబడిలోనే జీవిత పాఠాలను బోధిస్తారు


అన్నెపు జ్యోతికుమారి, జీవశాస్త్ర ఉపాధ్యాయిని

ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలే చదువుకునేందుకు అందరికీ ఉన్న ఏకై క అవకాశం. కానీ మారుతున్న కాలంతోపాటు ప్రభుత్వ పాఠశాలలకు పోటీగా కార్పొరేట్ పాఠశాలలు అవతరించాయి. కానీ ప్రస్తుతం మన దేశంలో కానీ, రాష్ట్రంలో కానీ ఉన్నత స్థానాల్లో స్థిరపడిన వారు ,ప్రజాప్రతినిధులుగా ఉన్న వారిని గమనిస్తే వారంతా ప్రభుత్వ బడుల్లో చదివి ఉన్నతంగా రాణించిన ఘటనలు మనకు కనిపిస్తున్నాయి. ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు అనుభవనీయులైన ఉపాధ్యాయులు బోధనతో పాటుగానే జీవితపాఠాలు బోధిస్తారు. ఇక్కడ చదువుకున్న బాలబాలికలు జీవితంలో సమస్యలను సంఘర్షణలతో కూడిన జీవితాన్ని సులువుగా అధిగమించే లక్షణం అలవర్చుకోగలుగుతారు. ఓ ప్రభుత్వ ఉపాధ్యాయడిగా కవిటి ప్రభుత్వపాఠశాలలో పనిచేస్తున్నాను. నా ఇద్దరు పిల్లల్ని కవిటి మండలపరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల లోనే చదివిస్తున్నాను.

• మనల్ని ఆదర్శంగా తీసుకోవాలి


కుమార్తె సాహితితో తరగతి గదిలో ఉపాధ్యాయుడు శంకరం

కవిటి మండలం జమేదారుపుట్టుగ గ్రామానికి చెందిన ఈ ఉపాధ్యాయుడు పేరు బందారు శంకరం. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షుడిగా పనిచేస్తూ ఇచ్ఛాపురం మండలం ఇన్నేశుపేట ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. సర్కారు బడిలో పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులు, బైజూస్ కంటెంట్, ఇంగ్లిష్ ల్యాబ్‌తో పాటు ఒత్తిడి లేని చదువులు అందిస్తున్న ఏకైక విద్యాసంస్థ ఏదంటే ఒక్క సర్కారు బడులే అని అంటున్నారు శంకరం మాస్టార్. అందుకే తమకు అందుబాటులో ప్రైవేటు పాఠశాలలు ఉన్నప్పటికీ తన కుమార్తె సాహితిని తాను పనిచేస్తున్న సర్కారు బడిలో చదివిస్తున్నట్లు చెబుతున్నారు.

• ప్రభుత్వబడి విద్యార్థుల సహజశక్తి కేంద్రం


ప్రియా అన్విత/వేణుగోపాల్, ఫిజికల్ సైన్స్ అసిస్టెంట్, జెడ్పీహెచ్‌స్కూల్, బొరివంక

విద్యార్థి దశనుంచే పిల్లలకు అన్నివర్గాలకు చెందిన పిల్లలతో కలిసిమెలిసి ఎదిగే అవకాశం ప్రభుత్వ బడిలోనే లభిస్తుంది. కార్పొరేట్ బడుల్లో ఉండే దర్పం బాల్యంలో పిల్లలకు దరిచేరితే ఎదిగే క్రమంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుంది. వాస్తవానికి సుశిక్షితులు, ఉన్నత అర్హతలు కలిగిన ఉపాధ్యాయులచే బోధన ప్రభుత్వ బడిలోనే లభిస్తుంది. ప్రభుత్వ బడి ఓ సహజశక్తి కేంద్రం. ఇక్కడ చదువు కోవడం ద్వారా పిల్లల్లో సహజసిద్ధమైన విజ్ఞానం పెరగడమే కాకుండా జీవితానికి అవసరమైన విలువలు వృద్ధి చెందుతాయి. మా పెద్ద పాప ప్రభుత్వ బడిలోనే చదివి ఇంజనీరింగ్ చదువుతోంది. మా చిన్నపాప అన్వితను కూడా అదేపద్ధతిలో నేను పనిచేస్తున్న పాఠశాలలోనే చేర్పించాను.

మహల్పడ లేఅవుట్‌ను పరిశీలించిన ఆర్డీవో

కంచిలి: మండలంలోని బొగాబెణి పంచాయతీ పరిధిలో మహల్పడ గ్రామంలో ఒక రియల్ ఎస్టేట్ కంపెనీ వేసిన లే అవుట్‌లో ఆక్రమణలు చోటుచేసుకొన్నాయనే ఫిర్యాదుపై పలాస ఆర్డీఓ భరత్‌నాయక్ సంబంధిత లే అవుట్, మిగతా స్థలాన్ని బుధవారం పరిశీలించారు. లే అవుట్ నిర్వాహకులు బి.డి.ఆర్. పట్టా భూములు, గ్రామకంఠం భూముల్ని కలిపి చదును చేశారనే అభియోగంతో ఆర్డీఓ ఆయా భూముల్ని స్థానిక తహశీల్దార్ వై.జయలక్ష్మి, డీటీ సంతోష్, మండల సర్వేయర్ నాగేశ్వరరావు, మిగతా సిబ్బందితో కలిసి పరిశీలించారు. లే అవుట్‌కు ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలాల్లో ప్లాట్లు అమ్మినట్‌లైతే కొనుగోలు చేయొద్దని పత్రికా ముఖంగా సూచించారు. పర్యటనలో స్థానిక సర్పంచ్ గణప సింహాచలం ఉన్నారు.

ఉత్తమ గురువులు వీరే..

ఇచ్ఛాపురం రూరల్: జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా పలువురు ఎంపికయ్యారు. వీరి ఎంపికపై ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థులు, తోటి ఉపాధ్యాయ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. వీరికి జిల్లా కేంద్రం శ్రీకాకుళంలో గురువారం జరగనున్న ప్రత్యేక కార్యక్రమంలో ఉన్నతాధికారులు అవార్డులను ప్రదానం చేయనున్నారు.


నరేంద్ర పట్నాయక్

• ఇచ్ఛాపురం మండలం కొళిగాం ఉన్నత పాఠశాలలో హిందీ భాషోపాధ్యాయునిగా పని చేస్తూ ప్రధానోపాధ్యాయునిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న నరేంద్రనాథ్ పట్నాయక్ ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎంపికయ్యారు. విద్యార్థులకు హిందీ భాషపై పట్టు పెంచేందుకు వివిధ కృత్యాల ద్వారా విద్యా బోధన చేస్తుంటారు. ఏటా పదో తరగతి విద్యార్థుల కోసం 'హిందీ మాడ్యూల్' తయారీ చేస్తూ మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేస్తుంటారు.


బి.శంకరం

• ఇచ్ఛాపురం మండలం ఇన్నేశుపేట ప్రాథమిక పాఠశాలలో సహోపాధ్యాయుడిగా పనిచేస్తున్న బి.శంకరం కూడా ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎంపికయ్యారు. విద్యార్థులకు జ్ఞానాత్మక, సామాజిక, సాంస్కృతిక నేపథ్యాలకనుగుణంగా విద్యా బోధన చేస్తుంటారు. విద్యార్థులకు దేశభక్తి, పిల్లల సామర్థ్యాలు, పర్యావరణ స్పృహ, సంస్కృతీ సంప్రదాయాలతో బోధన చేస్తున్న శంకరం మాస్టార్‌కు అవార్డు వరించడంపై పలువురు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


కొప్పల రామచంద్రుడు

• వజ్రపుకొత్తూరు: మండలంలోని మంచినీళ్లపేట ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వర్తిస్తున్న కొప్పల రామచంద్రుడు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక అయ్యారు. విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దేలా బోధన చేస్తూ గుర్తింపు తెచ్చుకున్నారు.


తోట కామేశ్వరరావు


సలుగు శ్రీనివాసరావు

• సోంపేట: మామిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ తెలుగు ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న తోట కామేశ్వరరావు, స్కూల్ అసిస్టెంట్ హిందీ ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్న సలుగు శ్రీనివారావులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.వసంతరావు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలియజేశారు.


కొయ్యల శ్రీనివాసరావు

• పలాస: బ్రాహ్మణతర్లా జెడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న కొయ్యల శ్రీనివాసరావును ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వరించింది. ఇదే పాఠశాలలో ఈయన చదువుకున్నారు. పోటీ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తుంటారు. రాష్ట్రపతిగా పనిచేసిన అబ్దుల్ కలామ్ నుంచి పర్యావరణ మిత్ర పురస్కారాన్ని కూడా అందుకున్నారు.


సంగీత సరళ సరస్వతీదేవి

• కోటబొమ్మాళి: కోటబొమ్మాళి మండలం నిమ్మాడ హైస్కూల్‌లో బయోలజీ స్కూల్ అసిస్టెంటుగా పనిచేస్తున్న యు.సంగీత సరళ సరస్వతీదేవి ఉత్తమ ఉపాధ్యాయరాలిగా ఎంపికయ్యారు. పొందూరులో జన్మించిన ఈమె ఎమ్మెస్సీ, బీఈడీ చదివారు. ఈమెకు సంగీతంపై ఉన్న మక్కువతో టీవీ షోలలో కూడా పాల్గొని మంచిగాయనిగా పేరుతెచ్చుకున్నారు. పాఠశాల హెచ్‌ఎం తంగి వెంకటరమణ హర్షం వ్యక్తం చేశారు.


చింతాడ లక్ష్మణరావు

• కోటబొమ్మాళి: నిమ్మాడ హైస్కూల్‌లో ఫిజిక్స్ స్కూల్ అసిస్టెంటుగా పనిచేస్తున్న చింతాడ లక్ష్మణరావు కూడా జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎంపికయ్యారు.


టి.ప్రసాదరావు

• నందిగాం: లఖిదాసుపురం ఉన్నత పాఠశాలలో ఫిజిక్స్ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న టి.ప్రసాదరావును పురస్కా రం వరించింది. 26 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న ఈయన విద్యార్థులను పోటీ పరీక్షలకు సిద్ధం చేసి గుర్తింపు పొందారు. ప్రధానోపాధ్యాయులు చిలుకు క్రిష్ణారావు, ఉపాధ్యాయులు ప్రోత్సాహంతో ఈ గౌరవం దక్కిందని ప్రసాదరావు తెలిపారు.


పి.విలియమ్స్


శివానంద ప్రకాశరావు


డి.సూర్యకాంతం


నిడగంటి సురేష్‌కుమార్

టెక్కలి: టెక్కలి మండలం నుంచి నలుగురు ఉపాధ్యాయులు జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఎంపికయ్యారు. వీరిలో పోలవరం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయుడు, ఉప విద్యా శాఖాధికారి (ఎఫ్ఏసీ) పి.విలియమ్స్, రాళ్లపేట ఎంపీయూపీ పాఠశాలకు చెందిన హనుమంతు శివానంద్ ప్రకాశరావు (స్కూల్ అసిస్టెంట్, బయాలజీ), టెక్కలి బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయురాలు డి.సూర్యకాంతం, బొరిగిపేట ఎంపీయూపీ పాఠశాలకు చెందిన నిడగంటి సురేష్‌కుమార్ ఉన్నారు.

ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి

• సీఐ విజయ్‌కుమార్

టెక్కలి రూరల్: టెక్కలి పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ పై ప్రత్యేక దృష్టి సారించిన ట్టు సీఐ అంబటి విజయ్‌కుమార్ చెప్పారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం విలేకర్లతో మాట్లాడారు. ట్రాఫిక్ సమస్యకు రోడ్లపై పశువులు అధికంగా ఉండటం, ఫుట్‌పాత్ వ్యాపారాలు కారణంగా గుర్తించామన్నారు. మైనర్, ర్యాష్, ట్రిబుల్ రైడింగ్‌ను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగివారిని ఉపేక్షించమన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్, మహిళ వసతిగృహాలు, కళాశాలల పరిసరాల్లో ఆకతాయిల ఆగడాలు ఎక్కువగా ఉన్నట్లు ఫిర్యాదులు ఉన్నాయని.. వాటిపై నిఘా పెట్టినట్టు చెప్పారు. దొంగతనాలు అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎవరైన ఇళ్లకు తాళాలు వేసి క్యాంపులు వెళ్తే అలాంటి వారు ముందుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. వారి ఇంటివద్ద ఎల్‌హెచ్‌ఎంఎస్ పద్ధతిలో కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. శనివారం నుంచి ప్రారంభం కానున్న గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండపాల ఏర్పాటుకు పోలీసుల ముందస్తు అనుమతి తీసుకోవాలని కోరారు. ఇప్పటి వరకు 20 వరకు అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు.

సంక్షిప్తంగా...

ఉద్దానంలో కొలంబియా బృందం పరిశోధనలు


అమెరికా శాస్త్రవేత్త లాక్స్‌వాన్‌గీస్‌ను పరిచయం చేసుకుంటున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కాశీబుగ్గ: అమెరికా కొలంబియా యూనివర్సిటీ నుంచి వచ్చిన బృందం ఉద్దాన ప్రాంతాల్లో మట్టి, తాగునీరు, రక్త నమూనాలు సేకరించి పరిశోధన చేస్తారని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. పలాసలోని డాక్టర్ వైఎస్సార్ కిడ్నీ పరిశోధన కేంద్రంలో బుధవారం ఎమ్మెల్యే గౌతు శిరీషతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కిడ్నీ మహమ్మారి మూలాలను కనుగొనేందుకు పరిశోధనలు దోహదపడతాయన్నారు. కొలంబియా యూనివర్సిటీ రసాయన శాస్త్రవేత్త డాక్టర్ లాక్స్‌వాన్‌గీస్ మాట్లాడుతూ నమూనాలు సేకరించి ఇక్కడే పరీక్షిస్తామని, కొన్ని శాంపిల్స్‌ను అమెరికా తీసుకెళ్లి పరీక్షిస్తామని చెప్పారు. కార్యక్రమంలో నెఫ్రాలజిస్టు డాక్టర్ రాకేష్, యూరాలజిస్టు డాక్టర్ కిషోర్‌కుమార్ సూపరింటెండెంట్ డాక్టర్ అల్లు పద్మజ, డాక్టర్ కూన మోహనబాబు, నాయకులు లొడగల కామేశ్వరరావు, వజ్జ బాబూరావు, మల్లా శ్రీనివాసరావు, గాలి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కండక్టర్ ఇంట్లో చోరీ


చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

కాశీబుగ్గ: మందస మండలం హరిపురంలోని బజారువీధి పోస్టాఫీస్ ఎదురుగా నివాసముంటున్న ఆర్టీసీ కండక్టర్ నల్ల మోహనరావు ఇంట్లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. సుమారు 8 తులాల బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. మందస ఎస్ఐ ఎస్కె ఖాదర్ బాషా తెలిపిన వివరాల ప్రకారం.. మోహనరావు ఆగస్టు 31న ఇంటికి తాళాలు వేసి విశాఖపట్నంలో ఉంటున్న తన కుమారుడి ఇంటికి వెళ్లారు. బుధవారం ఉదయం ఇరుగు పొరుగువారు చూసేసరికి తాళాలు విరగ్గొట్టి ఉండటంతో వెంటనే మోహనరావుకు ఫోన్ చేయగా విశాఖ నుంచి హరిపురం చేరుకున్నారు. దీంతో ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించారు. బీరువా తాళాలు పగలు గొట్టి నగదు దోచుకుపోయారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాశీబుగ్గ డీఎస్పీ పి.శ్రీనివాసరావు, రూరల్ సీఐ ఈశ్వరరావు, మందస ఎస్ఐ బాషా, ఏఎస్ఐ శేఖర్ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.

రైల్వేఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు చేపట్టాలని వినతి

కాశీబుగ్గ: కాశీబుగ్గ ఎల్‌సీ గేటు వద్ద రైల్వేఫ్లైఓవర్ వంతెన పనులు వేగవంతం చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొర్రాయి బాలకృష్ణ కోరారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్‌ను జిల్లా కేంద్రం శ్రీకాకుళంలో కలిసి వినతి పత్రం అందజేశారు.

కంచమ్మతల్లి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

కంచిలి: కంచిలిలోని కంచమ్మతల్లి దేవస్థానం అభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గం ఇటీవల ఎంపికైంది. ఆలయం ఆవరణలో బుధవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడుగా వంకల సోమేష్, ఉపాధ్యక్షుడుగా లింగవారి క్రాంతి కుమార్, సెక్రటరీగా గుడియా శ్రీను, జాయింట్ సెక్రటరీగా సెనాపతి రుషి, కోశాధికారిగా నాగేంద్ర పట్నాయక్, గౌరవ అధ్యక్షుడుగా మురళీ మోహన్ పట్నాయక్, గుమ్మడి రామదాసు, కన్వీనర్లుగా గుడియా దొయాస్వామి, ఎర్ర ప్రవీణ్, పాలిన సోమేశ్‌లు ప్రమాణం చేశారు.

వినాయక విగ్రహాల పంపిణీ

సోంపేట: పర్యావరణ పరిరక్షణకు మట్టిగణపతి ప్రతిమలనే పూజించాలని డాక్టర్ రామకృష్ణ, ఎస్ఎస్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు అన్నారు. ఎస్ఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోంపేట పట్టణంలో మట్టి విగ్రహాలను భారీగా పంపిణీ చేశారు.

సినిమా థియేటర్ల తనిఖీ

ఇచ్ఛాపురం/రూరల్: మండలంలో ఎం.తోటూరు పూర్ణా థియేటర్, బోర్డర్ మణికంఠ ఎల్‌మాక్స్ సినిమా హాళ్లను పలాస ఆర్డీవో డాక్టర్ భరత్ నాయక్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మరుగుదొడ్లు, తినుబండారాల స్టాల్స్, హాల్ లోపల సీట్లు, వెలుపల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రేక్షకులకు అసౌకర్యంగా ఉండరాదని, టిక్కెట్లు ఇష్టారీతిలో అమ్మకాలు చేస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు.